
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రంగారెడ్డి

5 జిల్లా వార్తలు

శుక్రవారం 26 జూలై 2024



ఇంటర్ ఫస్టియర్‌లో ఖాళీల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

రంగారెడ్డి అర్బన్, జూలై 25 : గురుకులాల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన ఖాళీలకు ఒకేషనల్ గ్రూపుతో కలిపి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్-రంగారెడ్డి జోనల్ అధికారి నాగకల్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9గంటలకు చేవెళ్ల టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కాలేజీలో బాలికలకు, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల బాలురకు ఈనెల 27న ఉదయం 9గంటలకు కందుకూరులోని టీజీఎస్‌డబ్ల్యుఆర్ఎస్ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.



రాష్ట్ర శాసనసభలో గురువారం ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉమ్మడి జిల్లా రైతాంగానికి ఊరట కలిగించేలా ఉంది. ఎక్కువగా వ్యవసాయ రంగాలకు నిధులు కేటాయించడం ఉమ్మడి జిల్లా రైతులకు కలిసి రానుంది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కోట్‌పల్లి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు జరిగింది. ఇటీవల కాలంలో కోట్‌పల్లి ప్రాజెక్టుకు ఎక్కువ నిధులు కేటాయించడం ఇదే తొలిసారి. ఇక శివారు ప్రాంతాల్లో శాటిలైట్ టౌన్‌షిప్‌లు ఏర్పాటు చేయనుండడం కలిసి వచ్చే అంశం. సొంతింటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇచ్చేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతో ఇల్లులేని పేదలకు ఒక గూడు ఏర్పాటు చేసుకునేందుకు వీలు కలుగుతుంది. దీంతో వేలాదిమంది సొంతింటి వారు కానున్నారు.



పాలమూరుకు రూ. 2000 కోట్లు

రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి/ వికారాబాద్)

- కోట్‌పల్లి ప్రాజెక్టుకు రూ. 10కోట్లు
- బడ్జెట్‌లో వ్యవసాయానికి పెద్దపీట
- అనంతగిరికి పర్యాటక సొబగులు
- సాగు భూములకే రైతు భరోసా
- రైతు కూలీలకు రూ.12,000
- శివార్లలో శాటిలైట్ టౌన్‌షిప్‌లు
- పెన్షన్ల పెంపు ప్రస్తావనే లేదు
- ఎయిర్‌పోర్టు వరకే మెట్రో
- ఫార్మాసిటీ ఊసే లేదు

కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో వ్యవసాయ, సంక్షేమ బాట పట్టింది. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క గురువారం అసెంబ్లీలో పూర్తిస్థాయి రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా పలు స్కీమ్‌లకు నిధులు కేటాయించినప్పటికీ కొన్ని స్కీమ్‌ల ప్రస్తావన బడ్జెట్‌లో లేదు. వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యత ఇచ్చారు. మహిళలు, రైతులతో పాటు వివిధ వర్గాల వారికి సంక్షేమ పథకాల కింద భారీగా నిధులు కేటాయించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా కింద ఎకరాకు రూ. 15వేలు ఇవ్వనున్నట్లు మంత్రి ప్రకటించారు. గత ఎన్నికల్లో రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ. 15వేలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే, అనర్హులకు రైతు భరోసా ఇవ్వబోమని, వ్యవసాయం చేసే రైతులకే పెట్టుబడి సహాయం అందిస్తామని వెల్లడించారు. కాంగ్రెస్ మాట ఇస్తే శిలాశాసనమని గతంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అందిస్తామని తెలిపారు. ఇదిలా ఉంటే వ్యవసాయం లేని రైతు కూలీ కుటుంబాలకు ఏడాదికి రూ. 1,200 చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో లక్షలాది కుటుంబాలకు మేలు జరగనుంది. వరి సాగు చేసే రైతులకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇచ్చేందుకు అవసరమైన నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది నుంచి ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం కింద రైతులు చెల్లించాల్సిన బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించనుందని ప్రకటించారు. ఇక ఉమ్మడి జిల్లా వాసులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు చెప్పినప్పటికీ ఈ ఏడాది బడ్జెట్‌లో కేవలం రూ. 2వేల కోట్లు మాత్రమే కేటాయించారు. దీంతో ఈ ప్రాజెక్టు పూర్తి కావడానికి మరి కొన్నేళ్లు పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది బడ్జెట్‌లో కేటాయించిన నిధులతో ఉమ్మడి జిల్లాలో కొంత మేర పనులు చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ప్రాజెక్టు కింద ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టలేదు. తాజా బడ్జెట్‌లో పెన్షన్ల పెంపుపై ప్రస్తావన లేదు. గత ఎన్నికల్లో పేద వర్గాలకు అందించే పెన్షన్లు రూ. 4వేలకు మించి పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అలాగే ఎక్కడా ఫార్మాసిటీ ఊసే లేదు. గతంలోనే సీఎం రేవంత్‌రెడ్డి ఒకేచోట ఫార్మాసిటీ ఏర్పాటుకు బదులు ఫార్మా క్లస్టర్ల ఏర్పాటు చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే.

సొంతింటి కలకు రూ.5లక్షలు

పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన వారికి రూ.5లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు వెల్లడించారు. ఇళ్ల నిర్మాణాల కోసం ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షల చొప్పున అందజేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఈ ఏడాది ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయిస్తామని బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. అలాగే పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులకు పంపిణీ చేస్తామన్నారు. అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేసేందుకు నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు.

పర్యావరణ పర్యాటకంగా అనంతగిరి

తెలంగాణ ఊటీగా పేరొందిన అనంతగిరి కొండలను పర్యావరణ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో పర్యావరణ పర్యాటక రంగాన్ని అభివృద్ధి పరిచేందుకు ఏడు అటవీ ప్రాంతాలను ఎంపిక చేయగా, దాంట్లో అనంతగిరి సర్క్యూట్ ఒకటి. పర్యావరణ పరిరక్షణతో పాటు రాష్ట్రానికి ఆదాయ వనరులు సమకూరేలా పర్యావరణ పర్యాటకాన్ని అభివృద్ధి పరచనున్నారు. కొండలు, గుట్టలు, చెట్లు, జలపాతాలు, వన్యజీవులు, జలాశయాలకు నష్టం జరగకుండా అటవీ సంపదను పరిరక్షించుకుంటూ మరింత విస్తృత పరిచేలా చర్యలు తీసుకోనున్నారు. అటవీ పరిరక్షణ, అభివృద్ధికి దోహదపడే విధంగా పర్యావరణ పర్యాటక రంగాన్ని విస్తృత పరచనున్నారు. ఒడిశా, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న పద్ధతుల్లో ఉత్తమ విధానంతో ఎకో టూరిజం పాలసీని రూపొందించి అమలు చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో వివరించారు. అనంతగిరిని పర్యావరణ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరిస్తే స్థానికంగా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగు పడనున్నాయి.

శివార్లలో శాటిలైట్ టౌన్‌షిప్‌లు



నగర శివార్లలో అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉండే విధంగా శాటిలైట్ టౌన్‌షిప్‌లు నిర్మిస్తున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు. తక్కువ ధరలకే పేద, మధ్య తరగతి వర్గాల వారికి అనుకూలమైన నివాస గృహాలు నగరం చుట్టూ నిర్మిస్తామని తెలిపారు. అలాగే రీజినల్ రింగు రోడ్డుకు రూ. 1,525 కోట్లు కేటాయించారు. మూసీ రివర్ ఫ్రంట్‌కు రూ. 1,500కోట్లు, ఔటర్ రింగురోడ్డుకు రూ. 200 కోట్లు కేటాయించారు. మూసీ రివర్ ఫ్రంట్ పనులకు నిధులు కేటాయించడంతో శివార్లలో మూసీ సుందరీకరణ పనులు ఊపందుకోనున్నాయి.



శంషాబాద్ వరకు మెట్రో విస్తరణకు రూ.100 కోట్లు

శంషాబాద్ వరకు మెట్రోలైన్ విస్తరణ చేపట్టనున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఓల్డ్ సిటీని అనుసంధానిస్తూ శంషాబాద్ వరకు మెట్రో పనుల విస్తరణకు రూ.100కోట్లు కేటాయించారు. అలాగే నాగోల్ నుంచి ఎల్‌బీనగర్ లైన్ కూడా అనుసంధానిస్తున్నట్లు తెలిపారు. గతంలో హామీ ఇచ్చిన మేరకు మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు, ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు మెట్రో విస్తరణ చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అయితే గతంలో సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు మెట్రోను కందుకూరు వరకు విస్తరిస్తామని ప్రకటించారు. కానీ ఈ బడ్జెట్‌లో ఈ విషయం ప్రస్తావనే లేదు. ఇక హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు కలిపి విపత్తుల నిర్వహణ సంస్థ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

కోట్‌పల్లి ప్రాజెక్టుకు నిధుల వరద



వికారాబాద్ జిల్లాలో ఏకైక మధ్య తరహా ప్రాజెక్టు కోట్‌పల్లికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 10 కోట్లు కేటాయించింది. చాలా సంవత్సరాలుగా కోట్‌పల్లి ప్రాజెక్టు మరమ్మతులకు నోచుకోవడం లేదు. కాలువలు, తూములు శిథిలావస్థకు చేరాయి. ఇటీవల కాలంలో కోట్‌పల్లి ప్రాజెక్టుకు ఎక్కువ నిధులు కేటాయించడం ఇదే తొలిసారి. ప్రాజెక్టు నిర్వహణ, మరమ్మతు పనుల కోసం రూ.25 లక్షల నుంచి రూ. 50లక్షల వరకు కేటాయింపులు చేసేవారు. అయితే ఈసారి కోట్‌పల్లి ప్రాజెక్టు మరమ్మతులు, నిర్వహణ తదితర పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ.10 కోట్లు, భవన నిర్మాణాల కోసం మరో రూ.28 లక్షలు కేటాయించింది. కోట్‌పల్లి ప్రాజెక్టును ఆధునీకరించి పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరందించేందుకు ఇటీవల రూ.110 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అంతే కాకుండా ఇరిగేషన్ డివిజన్, సబ్ డివిజన్ కార్యాలయాల నిర్మాణానికి రూ.1.54 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనల నివేదికను ప్రభుత్వానికి పంపించిన విధితమే. కాగా, రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో కోట్‌పల్లి ప్రాజెక్టుకు రూ.10 కోట్లు, భవన నిర్మాణాలకు రూ.28 లక్షలు కేటాయించింది.

రంగారెడ్డి జిల్లాకు అన్యాయం



రాష్ట్రానికి అత్యధిక ఆదాయాన్ని సమకూర్చిపెట్టే రంగారెడ్డి జిల్లాకు బడ్జెట్ కేటాయింపులో అన్యాయం జరిగింది. సీఎం సొంత నియోజకవర్గానికి భారీగా నిధులు కుమ్మరించుకుని పక్కనే ఉన్న రంగారెడ్డి జిల్లాపై శీతకన్ను పెట్టారు. కూరగాయలజోన్ గురించి స్వయంగా సీఎం ప్రకటించినా ఫలితం లేదు. మొత్తంగా రంగారెడ్డి జిల్లాకు ప్రయోజనం శూన్యం

- బొక్క నర్సింహారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు, రంగారెడ్డి

పేదలకు ఆమోదయోగ్యం



రాష్ట్ర బడ్జెట్ పేద ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉంది. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, మౌలిక సదుపాయల కల్పనకు అనుగుణంగా ఉంది. ఎయిర్‌పోర్టుకు మెట్రో వేసేందుకు రూ.వంద కోట్లు, మూసీ అభివృద్ధి కోసం రూ.1,500 కోట్లు కేటాయించడం శుభ పరిణామం.

పాలమాకుల జంగయ్య

సీపీఐ జిల్లా కార్యదర్శి, రంగారెడ్డి

ప్రజారంజక బడ్జెట్



ఇది పేదల బడ్జెట్. వ్యవసాయ, అనుబంధ రంగాలకు పెద్దపీట వేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తుంది. విద్య, వైద్యం, విద్యుత్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమానికి నిధులు కేటాయింపు జరిగింది. ఐటీ, నీటి పారుదల వంటి వాటికి బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయి.

- చల్లా నర్సింహారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, రంగారెడ్డి

విద్యారంగానికి అంతంత మాత్రమే



రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కొఠారి కమిషన్ నివేదిక ప్రకారం విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలి. కానీ.. కేవలం 7.31శాతమే కేటాయించింది. గత ఏడాది బడ్జెట్ 6.57 శాతంతో పోలిస్తే స్వల్పంగా పెరిగినట్లు కనిపించినా విద్యారంగానికి సరిపోయే నిధులు పెంచలేదు.

- ఏవీ సుధాకర్,

ఎస్టీయూటీస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి

పెన్షన్ల పెంపు ప్రస్తావనే లేదు



పెన్షన్లపై పెంపు చేస్తామని చెప్పిన ప్రభుత్వం బడ్జెట్‌లో దాని ప్రస్తావనే తేలేదు. తెల్లరేషన్‌కార్డు ఉన్న మహిళలకు 2,500 రూపాయలు పంపిణీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం బడ్జెట్‌లో దాని గురించి ప్రస్తావించలేదు. కాంగ్రెస్ సర్కార్ మహిళలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. మహిళల అభివృద్ధికి నిధులు పెంచాలి.

- లంబ మంజుల, ఘట్‌కేసర్, మేడ్చల్

ప్రజాపాలనకు అద్దం



ఆర్థికమంత్రి భట్టి ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజాపాలనకు అద్దం పట్టే విధంగా ఉంది. అన్ని వర్గాలకు ప్రాధాన్యతను ఇచ్చేలా ఉంది. ప్రధానంగా వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేశారు. పాత అప్పులు చెల్లిస్తూనే సంక్షేమ పథకాలపై భారీగా నిధులు కేటాయించింది.

-టి.రామ్మోహన్‌రెడ్డి, వికారాబాద్ డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే

విద్యకు కేటాయింపులు పెంచాలి



గత సంవత్సరం రూ.2,90,000 కోట్ల బడ్జెట్‌లో విద్యకు రూ.19,093 కోట్లు కేటాయిస్తే, ఈసారి రూ.21,292 కోట్లు కేటాయించారు. రూ.2,200 కోట్లు అదనంగా కేటాయించినప్పటికీ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న 15శాతంలో సగానికి మించలేదు. ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి ఈ కేటాయింపులు సరిపోవు. విద్యకు కేటాయింపులు పెంచాలి.

- పి.మాణిక్‌రెడ్డి, ప్రధాన సంపాదకుడు, వాయిస్ ఆఫ్ తెలంగాణ

ఈ-ఆఫీసు ద్వారా కార్యకలాపాలు చేపట్టాలి

రంగారెడ్డి అర్బన్, జూలై 25 : ప్రతీ శాఖలో ఈ-ఆఫీసు ద్వారా కార్యకలాపాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో ఈ-ఆఫీసు నిర్వహణపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారులందరూ ఫైళ్లన్నీ ఈ ఆఫీస్ ద్వారానే పంపాలని కలెక్టర్ తెలిపారు. ఈ ఆఫీస్ ద్వారా ఫైళ్లను పంపేందుకు ప్రతీ శాఖ అలవాటు చేసుకోవాలని, అవసరమైన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని ఏర్పరుచుకోవాలన్నారు. ప్రతీ శాఖ అవసరమైన సామగ్రి సమకూర్చుకోవాలని, రాబోయే రోజులన్నీ సాంకేతిక పరిజ్ఞానంపైనే ఆధారపడి ఉంటాయన్నారు. శాఖల వారీగా లాగిన్స్ పెండింగులో లేకుండా త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శశాంక

మున్సిపల్ అధికారులు ఉదయాన్నే ఫీల్డ్ విజిట్ చేయాలి

మున్సిపల్ అధికారులు ప్రతీ రోజు ఉదయం 7 గంటలకు ఫీల్డ్ విజిట్ చేయాలని, సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని కలెక్టర్ శశాంక అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో సీజనల్ వ్యాధులు, వనమహోత్సవం, వీధి కుక్కలకు శస్త్ర చికిత్సలు, మున్సిపల్ పరిధిలో అసంపూర్తిగా మిగిలిన పనులపై మున్సిపల్ కమిషనర్‌లతో సమీక్షించారు. వారం పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని మున్సిపల్ పరిధిలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండా, లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తాగునీరు కలుషితమై సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున క్లోరింగ్, ఫ్లోరైడ్ శాతాన్ని పెంచాలన్నారు. క్రమం తప్పకుండా కాలనీలలో దోమల నివారణకు స్ప్రే చేయించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా అటవీశాఖ అధికారులు, మెప్మా పీడీ, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆకాశమే హద్దుగా!

తలసరి, స్థూల ఉత్పత్తిలో రంగారెడ్డి 'టాప్'

- అత్యధికంగా రూ.9.46,862 తలసరి ఆదాయం
- నాలుగో స్థానంలో మేడ్చల్ జిల్లా
- అట్టడుగున వికారాబాద్



తలసరి ఆదాయం ఇలా (జిల్లాల వారీగా)

జిల్లా	తలసరి ఆదాయం
రంగారెడ్డి	9,46,862
మేడ్చల్	2,95,514
వికారాబాద్	1,80,241

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

తలసరి ఆదాయం, స్థూల ఉత్పత్తిలో రంగారెడ్డి జిల్లా ఆకాశమే హద్దుగా దూసుకుపోతోంది. రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం ఉన్న జిల్లాగా రంగారెడ్డి కొనసాగుతోంది. జాతీయ తలసరి ఆదాయానికి అయిదు రెట్లు అదనంగా రంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం ఉండడం గమనార్హం. శాసనసభలో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సందర్భంగా తెలంగాణ సామాజిక, ఆర్థిక సర్వే -2024ను ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. రూ.9.46,862 తలసరి ఆదాయంతో రంగారెడ్డి జిల్లా అగ్రస్థానంలో ఉంది. ఆ తరువాత రూ. 4,94,033తో హైదరాబాద్ రెండో స్థానంలో ఉండగా 2,95,514 తలసరి ఆదాయంతో మేడ్చల్ నాలుగో స్థానంలో ఉంది. అయితే ఉమ్మడి జిల్లా నుంచి వేరుపడిన వికారాబాద్ జిల్లా రూ.1,80,241 తలసరి ఆదాయంతో రాష్ట్రంలో చివరి స్థానంలో ఉన్నాయి. పక్కపక్కనే ఉన్న రెండు జిల్లాల్లో అంతరాన్ని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ వెనుకబడిన జిల్లాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇక స్థూల ఉత్పత్తిలో కూడా రంగారెడ్డి జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. స్థూల ఉత్పత్తిలో మేడ్చల్ జిల్లా మూడో స్థానంలో ఉండగా వికారాబాద్ గతం కంటే కొంత మెరుగుపడి 21వ స్థానంలో నిలిచింది. రాష్ట్రానికి ఆర్థికంగా గుండెకాయగా ఉన్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతి ఏటా ఆర్థికాభివృద్ధిలో దూసుకుపోతోంది. ముఖ్యంగా హైదరాబాద్ చుట్టు పక్కల భూముల ధరలు విపరీతంగా పెరగడంతో ఈ ప్రాంతాలు ప్రభుత్వానికి భారీగా ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న సంగతి తెలిసిందే. అలాగే రిజిస్ట్రేషన్ల శాఖ, ఆబ్కారీ, రవాణ శాఖకు వచ్చే ఆదాయంలో సింహభాగం రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల నుంచే వస్తోంది. నగర శివార్లలోని ఐటీ, ఫార్మా, ఇతర రంగాలకు చెందిన కంపెనీల ద్వారా రాష్ట్ర ఖజానాకు భారీగా నిధులు సమకూరుతున్న సంగతి విదితమే. ప్రతి ఏటా కొత్త కొత్త కంపెనీలు కూడా శివార్లలో కొలువు తీరుతున్నాయి. ఈ కారణంగా రంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం, స్థూల ఉత్పత్తిలో దూసుకుపోతోంది.

జిల్లా స్థూల ఉత్పత్తి (రూ.కోట్లలో)

జిల్లా	స్థూల ఉత్పత్తి
రంగారెడ్డి	2,83,419
మేడ్చల్	88,867
వికారాబాద్	19,840

ఎయిర్‌పోర్టులో మరిన్ని మెరుగైన సౌకర్యాలు

శంషాబాద్ రూరల్, జూలై 25 : విమాన ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని జీఎంఆర్ అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విమానాశ్రయంలో రద్దీ సమయాల్లో చాలామంది ప్రయాణికులు యాప్ ఆధారిత క్యాబ్‌ల(ఓలా, ఉబెర్)ను సంప్రదిస్తారని, రాత్రివేళల్లో కొన్నిసార్లు క్యాబ్‌లు అందుబాటులో లేక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. అయితే, క్యాబ్ యాజమాన్యాలతో మాట్లాడి ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రయాణికులు వారికి నచ్చిన క్యాబ్‌లను ఎంచుకోవచ్చని, ఇప్పటికే క్యాబ్ ఆపరేటర్ల యజమానులతో చర్చలు జరుపుతున్నామన్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఎయిర్‌పోర్టులో వేచి ఉండేందుకు చెల్లించే ఫీజును మాఫీ చేయడానికి క్యాబ్ సర్వీసుల అగ్రిగేటర్లతో మాట్లాడుతున్నామని చెప్పారు. ముఖ్యంగా అర్ధరాత్రి వేళ క్యాబ్‌లు దొరకని సమయంలో హెల్ప్‌డెస్క్‌కు సమాచారం అందిస్తే.. వెంటనే క్యాబ్‌లు ఏర్పాటు చేస్తామని జీఎంఆర్ పేర్కొంది. ఎయిర్‌పోర్టులో కొందరు ప్రయివేట్ క్యాబ్ డ్రైవర్లు ప్రయాణికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకునేందుకు స్థానిక పోలీసులతో కలిసి పని చేస్తామని చెప్పారు. ప్రయాణికులకు ఇబ్బందులకు గురిస్తే కఠిన చర్యలు తీసుకునేందుకు వెనకాడబోమని ఎయిర్‌పోర్టు అధికారులు హెచ్చరించారు.



నేదునూర్ మోడల్ స్కూల్ వరకు రోడ్డు వేయించాలి

కందుకూరు, జూలై 25 : మండలంలోని నేదునూర్ మోడల్ స్కూల్ వరకు రోడ్డు వేయాలని కోరుతూ గురువారం వందేమాతరం విద్యార్థి సేవా ఫోర్స్ అధ్యక్షుడు ఊటు మహేందర్ కలెక్టర్ శశాంకను కలిసి వినతిపత్రం ఇచ్చారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పాఠశాలకు బాలబాలికలు వస్తుంటారని, రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ డీఈవోకు ఫోన్‌చేసి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించినట్లు మహేందర్ చెప్పారు.

వాణిజ్య అభివృద్ధికి జీఎంఆర్ ఏరోసిటీ చక్కటి వేదిక

- జీఎంఆర్ ల్యాండ్ డెవలప్‌మెంట్ సీఈవో అమన్‌కపూర్
- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రీగస్ కార్యాలయం ప్రారంభం

శంషాబాద్ రూరల్, జూలై 25: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో వాణిజ్య అభివృద్ధికి జీఎంఆర్ ఏరోసిటీ చక్కటి వేదిక అని జీఎంఆర్ ల్యాండ్ డెవలప్‌మెంట్ సీఈవో అమన్‌కపూర్ అన్నారు. గురువారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రీగస్ అధికారులతో కలిసి వర్క్‌స్పేస్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూప్రపంచంలో వాణిజ్యం అభివృద్ధి చెందడానికి అనువైన ప్రదేశాలు ఉండడం చాలా కీలకమని, అందులో జీఎంఆర్ ఏరోసిటీ ఒక్కటని చెప్పారు. దేశంలోని వివిధ వాణిజ్య రంగాలను అనుసంధానం చేయడానికి ఈ స్పేస్ ఎం తో ఉపయోగకరంగా మారుతుందన్నారు. వివిధ వాణిజ్య సంస్థలకు లీజుకు ఇచ్చే కార్యాలయాలతో పాటు ఒక రోజు, ఒక గంట సమయానికి సమావేశమయ్యేందుకు కావాల్సిన సమావేశపు గదులు కూడా ఇందులో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పర్యావరణ హితంగా, సౌకర్యవంతమైన వర్కింగ్ స్పేస్ అభివృద్ధితో రీగస్ సంస్థతో భాగస్వామ్యం కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. అతిథ్యం, ఆరోగ్యం, సంరక్షణ, వినోదం, విద్య, పారిశ్రామిక పార్క్‌లతో సమీకృతంగా ఏరోసిటీ అభివృద్ధి చెందుతుందన్నారు. వాణిజ్య రంగాభివృద్ధి లో హైదరాబాద్ విస్తరణకు ఏరోసిటీ ఎంతో ఉపయోగకరంగా మారుతుందని అన్నారు. ఐడబ్ల్యూజీ మేనేజర్ శ్రీహర్ష్ లాంబా మాట్లాడుతూ హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో మాకొత్త రీగస్ సెంటర్‌ను ప్రారంభించడం ద్వారా వాణిజ్య కార్యకలాపాలు మెరుగుపర్చుకున్నామని చెప్పారు. వ్యాపార కేంద్రంగా జీఎంఆర్ ఏరోసిటీ పేరుగాంచిందని, అందుకోసమే ఇక్కడ వ్యాపార కార్యకలాపాలను ప్రారంభించామని చెప్పారు. ఇక్కడ మా కార్యకలాపాలను మెరుగుపర్చుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు జీఎంఆర్ ప్రతినిధితుల బృందం, రీగస్ అధికారుల ప్రతినిధులబృందం పాల్గొన్నారు.


శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రీగస్ కార్యాలయాన్ని ప్రారంభించిన జీఎంఆర్, రీగస్ సంస్థల ప్రతినిధులు

తాండూరు పశుసంవర్ధక శాఖ ఏడీ ప్రభురాజ్ బదిలీ

ఆయన స్థానంలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్



తాండూరు రూరల్, జూలై 25: తాండూరు పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ ప్రభురాజ్ మేడ్చల్ జిల్లా హెడ్ క్వార్టర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హైదరాబాద్ నగరంలోని నారాయణ గూడ పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తాండూరు పశు సంవర్ధక శాఖ ఏడీగా నియమితులయ్యారు. మరో రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక్కడ 14 సంవత్సరాలపాటు డాక్టర్ ప్రభురాజ్ సేవలందించారు. స్థానికంగా తాండూరులో ప్రజలకు అందుబాటులో ఉంటూ పశు సంవర్ధక శాఖలో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందారు. ఆస్పత్రికి వచ్చిన మూగ జీవాలకు ఎన్నో చికిత్సలు చేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న పశువులకు సకాలంలో వైద్యం అందించి కాపాడారు. ఆయన పశు వైద్య ఆస్పత్రిలో చేసిన సేవలు మరువలేనివని పాత తాండూరు, సాయిపూర్, మల్‌రెడ్డిపల్లి ప్రాంత రైతులు కొనియాడారు.


ఇందిరానగర్‌లో బోనాలు సమర్పిస్తున్న కాలనీవాసులు

వైభవంగా బోనాలు

వికారాబాద్, జూలై 25: వికారాబాద్ పట్టణంలోని ఇందిరానగర్, శివరాంనగర్ కాలనీలో బోనాల పండుగను గురువారం వైభవంగా నిర్వహించారు. కాలనీలోని అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇందిరానగర్ కాలనీలో కౌన్సిలర్ బొండల సువర్ణ అశోక్, గ్రామ పెద్దలు బొండల శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల మధ్య అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కాలనీ వాసులు మహిళలు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీడీపీవో నాగమణి, బలరామకృష్ణ

కొత్తూర్, జూలై 25: మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని షాద్‌నగర్ ఐసీడీఎస్ సీడీపీవో నాగమణి, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామ కృష్ణలు కోరారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశం హాల్‌లో అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. మానవ అక్రమ రవాణా ప్రపంచంలోనే అతి పెద్ద నేరమన్నారు. మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు ఉద్యోగం, ప్రేమ పెళ్లి, సినిమా అవకాశాల పేరుతో మోసాలకు గురవుతున్నారని గుర్తుచేశారు. మానవ అక్రమ రవాణాపై ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే అధికారులకు సమచారం అందించాలన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లోని అంగన్‌వాడి టీచర్లకు అవగాహన కల్పించి, వారి ద్వారా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లక్ష్మీబాయ్, జ్యోతి, ప్రజ్వల సిబ్బంది అనిల్‌కుమార్, మిథాళిరాజ్, టీచర్లు పాల్గొన్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు


రికార్డులను తనిఖీ చేస్తున్న ఏవో అరుణకుమారి

ఆమనగల్లు, జూలై 25: వానాకాలం పంటల సాగుకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఎవరైనా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ శాఖ అధికారి అరుణకుమారి తెలిపారు. ఎరువులు, విత్తన డీలర్లు ప్రభుత్వ నిబంధనలకు లోబడి నడుచుకోవాలని సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని ఎరువుల, విత్తన దుకాణాలను గురువారం ఏవో తనిఖీ చేశారు. రికార్డులను, విత్తన నిల్వలను, స్టాక్ బోర్డులను పరిశీలించారు. పంటలకు సరిపడా యూరియా, డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో డీలర్లు తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

మస్కు నర్సింహ వర్ధంతి సభను జయప్రదం చేయాలి

ఇబ్రహీంపట్నం, జూలై 25: ఇబ్రహీంపట్నంలో రేపు(శనివారం) నిర్వహించే మాజీ ఎమ్మెల్యే మస్కు నర్సింహ నాలుగో వర్ధంతి సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి కె.భాస్కర్‌లు కోరారు. గురువారం ఇబ్రహీంపట్నంలో జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. సీపీఎం నాయకులు సామ్యేల్, జంగయ్య, బుగ్గరాములు, జగన్, గణేష్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్-శ్రీశైలం హైవేను నాలుగు లేన్లుగా విస్తరించాలి


గడ్కరీకి వినతిపత్రం ఇస్తున్న తల్లోజు ఆచారి

ఆమనగల్లు, జూలై 25: హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. ఈమేరకు ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో గురువారం గడ్కరీని కలిసి వినతిపత్రం అందజేశారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి వరకు రోడ్డు విస్తరించి ప్రమాదాలను నివారించాలని వినతి పత్రంలో కోరారు. కల్వకుర్తి నుంచి కొల్లాపూర్ మీదుగా నంద్యాల వరకు జాతీయ రహదారి నిర్మిస్తున్నందున.. దానికి అనుసంధానమైన హైదరాబాద్-శ్రీశైలం రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రహదారి విస్తరణకు గడ్కరీ సానుకూలంగా స్పందించినట్లు ఆచారి పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు, నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులున్నారు.

కనుల పండువగా బోనాలు

● అమ్మవార్లకు నైవేద్యం సమర్పించిన గ్రామస్తులు

చేవెళ్ల, జూలై 25 : పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో గ్రామస్తులు ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. గురువారం చేవెళ్ల మండల కేంద్రంలోని సిల్వర్‌డైయిల్ పాఠశాలలో బోనాలు ఘనంగా నిర్వహించారు. ముడిమ్యాల్ గ్రామంలో మహిళలు బోనాలతో తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ మోహనచారి, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతా‌ప్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ప్రభాకర్, స్వర్ణలత, మాజీ డైరెక్టర్ గోనే కరుణాకర్‌రెడ్డి, నాయకులు, గ్రామస్తులు, తదితరులు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కేశంపేట : పాపిరెడ్డిగూడలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డి, సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, అబ్బి సుందరయ్య, శివయ్య, లక్ష్మీనారాయణ, చేవెళ్ల నర్సింహులు, నందు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


చేవెళ్ల : ముడిమ్యాల్ గ్రామంలో బోనాల ఊరేగింపు


కేశంపేట : పోచమ్మ ఆలయానికి బోనాలతో తరలివెళ్తున్న భక్తులు

షాబాద్ : కుర్వగూడ, సర్దార్‌నగర్, పెదవేడు గ్రామాల్లో పోచమ్మ, మైసమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతల మధ్య బో నాలు, తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులంతా అమ్మవారి ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు మహేష్, నరేష్, హరీష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.


షాబాద్ : కుర్వగూడలో బోనాలతో అమ్మవారి ఆలయానికి బయలుదేరిన గ్రామస్తులు

ప్రతీ వ్యక్తి నాలుగు మొక్కలు నాటి కాపాడాలి

● జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

యాచారం, జూలై 25 : పర్యావరణ పరిరక్షణకు ప్రతీ వ్యక్తి నాలుగు మొక్కలు నాటి కాపాడాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ కోరారు. గురువారం జిల్లా అటవీశాఖ అధికారులు వేణుమాధవరావు, సుధాకర్‌రెడ్డిలతో కలిసి యాచారం మండలంలోని గున్‌గల్ రిజర్వ్‌ఫారెస్టులో ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వృథా భూములు, ఖాళీ స్థలాల్లో వివిధ రకాల పండ్ల మొక్కలు నాటితే రైతులకు ఆర్థిక ఇబ్బందులు తీరుస్తాయనే విషయం వివరించాలన్నారు. అటవీరేంజర్ విష్ణువర్ధన్‌రావు, సెక్షన్ అధికారి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు. కాగా, వర్షాలు కురుస్తుండడంతో ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలను స్వీకరించాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి కోరారు. చౌదర్‌పల్లి, కుర్మిద్ద, మేడిపల్లి, నానక్‌నగర్, నజ్దిక్‌సింగారం, మల్కీజ్‌గూడ, తాటిపర్తి గ్రామాల్లో పర్యటించారు. మొక్కల సంరక్షణ బాధ్యతలను ప్రజలకు వివరించారు. తాగునీటి పైప్‌లైన్ లీక్ కాకుండా చూడాలన్నారు. పారిశుధ్యంపై దృష్టిసారించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. చౌదర్‌పల్లిలో పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం వడ్డన తీరుపై ఆరా తీశారు. గ్రామసమస్యలపై మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నర్సింహలను అడిగి తెలుసుకున్నారు.


యాచారం : గున్‌గల్ ఫారెస్టులో మొక్కలు నాటుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, అటవీశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి, వేణుమాధవరావు

శంషాబాద్ రూరల్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని శంషాబాద్ మండలంలోని పాలమాకుల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విష్ణుప్రియ కోరారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో విద్యార్థులతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాలలోని విద్యార్థుల్లో కొంత మందిని ఎర్త్ లీడర్స్‌గా నియమించి వారికి అధ్యాపకులు మాధవి, సీజీఆర్ వారు శిక్షణ అందించారు. పాఠశాలలో 1200 సపోట, నేరేడు, వేప, మందార, గన్నేరు తదితర మొక్కలను మియావాకి ప్లాంటేషన్ విధానంలో ఈ నెల 22, 23 తేదీల్లో ఐటీ ఉద్యోగులు మొక్కలు నాటి నీటి పైపులైన్ సదుపాయాన్ని కల్పించినట్లు ఆమె తెలిపారు.

కొత్తూర్ : ప్రస్తుత సీజన్‌లో మొక్కలను ప్రతీ ఒక్కరు విరివిగా నాటాలని కౌన్సిలర్ మాదారం నర్సింహగౌడ్ సూచించారు. మున్సిపాలిటీలోని 9వ వార్డులో కౌన్సిలర్ వనమహోత్సవంలో భాగంగా మహిళలకు మొక్కలు అందజేశారు. వార్డు సూపర్ వైజర్లు శ్రీనివాస్, విజయ్, అంగన్‌వాడీటీచర్ ఉమాదేవి, మహిళాసంఘాల సభ్యులు హైమావతి, స్వరూప, జాంగీర్‌బీ, తస్లీమ్, కాలనీవాసులున్నారు.


కొత్తూర్ : మొక్కలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ నర్సింహగౌడ్


సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నర్సింహారెడ్డి, నందకిషోర్ కార్యకర్తలు

బడ్జెట్ కేటాయింపులో జిల్లాకు తీరని అన్యాయం

శంషాబాద్, జూలై 25 : బడ్జెట్ కేటాయింపులో రంగారెడ్డి జిల్లాకు తీరని అన్యాయం చేసిన రేవంత్‌రెడ్డి సర్కార్ వెంటనే గద్దె దిగాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. జిల్లాకు బడ్జెట్‌లో నిధులు తక్కువగా కేటాయించినందుకు నిరసనగా నర్సింహారెడ్డి.. పార్టీ ఉపాధ్యక్షుడు నందకిషోర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తాలో గురువారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ జిల్లాను ఆదాయం సమకూర్చే జిల్లాగా చూస్తున్నారే తప్ప.. సరిపడా నిధులు కేటాయించకుండా అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు. జిల్లా అభివృద్ధి విషయంలో బీఆర్ఎస్ సర్కార్ ఏ విధంగా వ్యవహరించిందో.. ఈ ప్రభుత్వం కూడా అలాగే వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయడానికి నిధులు కేటాయించాలన్నారు. గతంలో సీఎంగా పనిచేసిన రోశయ్య రంగారెడ్డి జిల్లాను కూరగాయలు పండించే జోన్‌గా ప్రకటిస్తామన్నారన్న విషయం గుర్తుచేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజన్‌కుమార్, కిసాన్‌మోర్చా నాయకులు పాపయ్యగౌడ్, వై.శ్రీధర్, యువమోర్చా అధ్యక్షులు యాదీష్, వడ్డె చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ విఫలం

మహేశ్వరం, జూలై 25 : రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ఎలాంటి షరతులు లేకుండా మాఫీ చేయాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం తుక్కుగూడ మున్సిపల్ కేంద్రంలో కిసాన్‌మోర్చా జిల్లా కార్యవర్గసమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు, రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రేపు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రైతుల సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మంచాల మండలంలో ప్రారంభిస్తారని చెప్పారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, అంజయ్య, మల్లారెడ్డి, మిద్దె సుదర్శన్‌రెడ్డి, పోతర్లసుదర్శన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధికి దోహదపడే ప్రజారంజక బడ్జెట్'

కడ్తాల్, జూలై 25: భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజారంజకంగా, రాష్ట్రాభివృద్ధికి దోహదపడేలా ఉందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రూ.2,91,191 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమ రంగాలకు పెద్దపీట వేశారని అన్నారు. మండల కేంద్రంలో గురువారం డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహలతో కలిసి విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.72,659 కోట్లు కేటాయించడం రైతుల సంక్షేమం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలుకనుగుణంగా బడ్జెట్‌లో కేటాయింపులు చేయడం హర్షదాయకమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధి విద్య, వైద్య రంగాలకు, ఉపాధి కల్పనకు బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించడం జరిగిందన్నారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న సూదిని రాంరెడ్డి

ఆమనగల్లు/వెల్దండ, జూలై 25: సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి ఈనెల 28న కల్వకుర్తి నియోజకవర్గంలో పర్యటిస్తున్నట్లు టీపీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి తెలిపారు. సీఎం సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాంరెడ్డి మాట్లాడుతూ కొత్తగేటు వద్ద ఏర్పాటు చేసిన కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహాన్ని సీఎం ఆవిష్కరిస్తారని, మధ్యాహ్నం 3.30 గంటలకు కల్వకుర్తి పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 20వేల మందిని సమీకరణ చేస్తున్నట్లు రాంరెడ్డి తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు తెల్గమల్ల జగన్, బీచ్యనాయక్, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి ఫరీద్, మండలాధ్యక్షుడు షాబొద్దీన్ పాల్గొన్నారు. కొత్త చౌరస్తాలో సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని మాడ్గుల మాజీ ఎంపీపీ జంగయ్య, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు కట్ల యాదయ్యగౌడ్ కోరారు.

పారదర్శకంగా రుణమాఫీ : ఎమ్మెల్యే శంకర్


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్, జూలై 25 : రైతు రుణమాఫీ విషయంలో బ్యాంకర్లు రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. ఇందుకు సంబంధించి ఏమైన సాంకేతిక లోపాలుంటే సరిదిద్దాలని సూచించారు. గురువారం షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతు రుణమాఫీ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహించరాదని తెలిపారు. లక్షలోపు ఉన్న వారి ఖాతాలో రుణమాఫీ డబ్బులు జమకాకపోతే వ్యవసాయ శాఖ అధికారులు కారణాలను తెలుసుకోవాలన్నారు. కొంతమంది రైతులకు రుణమాఫీకి సంబంధించిన మార్గదర్శకాలు తెలియకపోవడం వల్ల తమకు రుణమాఫీ కాలేదని ప్రచారం చేస్తున్నారు. అలాంటి వారి దగ్గరికి వెళ్లి ఎందుకు రుణమాఫీ కాలేదో వారికి తెలియపర్చాలని సూచించారు. కాగా, రుణమాఫీని క్రమబద్ధీకరించుకున్న రైతులకు మాఫీ కాలేదని బ్యాంకర్లు ఎమ్మెల్యే దృష్టికి తేగా.. కారణాలను తెలుసుకుని ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజారత్నం మాట్లాడుతూ నియోజకవర్గంలో మొదటి విడతలో 13,468 మంది రైతులకు రుణమాఫీ వర్తిస్తుందని, వారందరి ఖాతాలో బ్యాంకర్లు నిధులు జమ చేయాలని కోరారు.

పన్నుల వసూలంత నిధులూ కేటాయించలేదు

రాష్ట్రం నుంచి పన్నుల రూపంలో వసూలు చేస్తున్నంత నిధులను కూడా కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు కేటాయించలేదని ఎమ్మెల్యే శంకర్ ఎద్దేవా చేశారు. క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ నుంచి 8 మంది ఎంపీలను గెలిపిస్తే అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించకుండా వివక్ష చూపిందని ఆందోళన వ్యక్తం చేశారు. బీహార్, ఉత్తరప్రదేశ్‌లకు మాత్రం వేలాది కోట్లు కేటాయించడం వెనుక ఉన్న మతలబేంటని ప్రశ్నించారు. కానీ తెలంగాణ రాష్ట్రానికి కనీసం బడ్జెట్‌లో 10 శాతం నిధులు కేటాయించడం హాస్యాస్పదమన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కిందని విమర్శించారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

జర్నలిస్టుల బాధలు తనకు తెలుసని, వారి సంక్షేమం కోసం ఇప్పటికే ఒక ప్రణాళిక సిద్ధం చేశామని ఎమ్మెల్యే అన్నారు. కొందరు జర్నలిస్టులు స్వార్థ ప్రయోజనాల కోసం జర్నలిజం విలువలను దిగజార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. క్యాంపు కార్యాలయంలో యూనియన్లకు అతీతంగా ఏర్పడిన షాద్‌నగర్ మెయిన్ మీడియా స్ట్రీమ్ యూనియన్ జర్నలిస్టులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ షాద్‌నగర్‌లో జర్నలిజానికి మెయిన్ మీడియా జర్నలిస్టులు తిరిగి పూర్వవైభవం తేవాలని కోరారు. జర్నలిస్టుల కోసం త్వరలోనే ప్రెస్‌క్లబ్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. మెయిన్ స్ట్రీం మీడియాను ఎలాంటి అడ్డంకులు లేకుండా కొనసాగించాలన్నారు. సీనియర్ జర్నలిస్టులు ఎండీ ఖాజపాషా, ఎల్.మోహన్‌రెడ్డి, సత్యనారాయణ, శరత్‌కుమార్, రాజశేఖర్, శివకుమార్ తదితరులున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

కొందుర్గు, జూలై, 25: సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి అమృతాజోసఫ్ కోరారు. సీజనల్ వ్యాధులపై గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. అమృత మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశాలు ఉంటాయని, నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటిని నిలువ చేసే పాత్రలపై మూతలను తప్పని సరిగా ఉంచాలని, చెత్తాచెదారం మురుగు కాలువల్లో చేరకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వారానికొకసారి సాయంత్రం వేళల్లో ఫాగింగ్ చేయించాలని సూచించారు. అన్ని గ్రామాల్లో నీరు నిలువ కుండా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్ని గ్రామాల ప్రత్యేకాధికారులకు సూచించారు. రెండు మండలాల తహసీల్దార్లు రమేష్‌కుమార్, జగదీశ్వర్, ఎంపీవో లాలయ్య, ఎంఈవో కిష్టారెడ్డి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

ఆదిభట్ల, జూలై 25 : పరిసరాల పరిశుభ్రతకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ ఆదిభట్లను స్వచ్ఛ మున్సిపాలిటిగా తీర్చిదిద్దేందుకు కృషి చేద్దామని మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి అన్నారు. కొంగరకలాన్ గ్రామంలో గురువారం కమిషనర్ బాలకృష్ణ స్థానిక కౌన్సిలర్లు వనం శ్రీనివాస్, మహేందర్, నగేష్‌లతో కలిసి పర్యటించారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనం పడుతున్న ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ఇండ్ల మధ్యలో పేరుకుపోయిన చెత్తను స్థానికులు మున్సిపల్ సిబ్బందితో కలిసి తొలగించారు. శిథిలావస్థలో ఉన్న 17 ఇండ్లను గుర్తించి వాటిని తొలగించేందుకు యాజమానులకు నోటీసులు అందజేశారు. కూలడానికి సిద్దంగా ఉన్న ఓ ఇంటిని జేసీబీతో కూల్చివేశారు. మిగతా వాటిని త్వరలోనే తొలగిస్తామని అన్నారు.గామంలో రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని తొలగించాలని మ్యాన్ వాల్స్ బిగించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్స్ సమస్యలు,గ్రామంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం తదితర సమస్యలు తన దృష్టికి రావడంతో త్వరలోనే పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఆదిభట్లను స్వచ్ఛ మున్సిపాలిటీగా మార్చేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఈ వీరాంజనేయులు, అబిబా మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


ఆదిభట్ల : కొంగరకలాన్ గ్రామంలో స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్ నిరంజన్ రెడ్డి

సంక్షిప్తంగా..

కందుకూరు : ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ కందుకూరు, బూన్ ఐవీఎఫ్‌సంతాన సాఫల్య కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో డా.శ్రావ్య తాల్లపురెడ్డి పర్యవేక్షణలో భూలక్ష్మి మెమోరియల్ ఆసుపత్రిలో ఉచిత సంతాన సాఫల్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు విఠల్‌రెడ్డి, కోశాధికారి కె.వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని ప్రజలు సద్వినియోగించుకోవాలన్నారు.

కడ్తాల్ : మైసిగండి పంచాయతీ కార్యదర్శిగా దశాబ్ద కాలం పనిచేసి తలకొండపల్లికి బదిలీ అయిన సత్యంను బీజేపీ జిల్లా నాయకుడు రాందాస్ నాయక్, మాజీ ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, మాజీ ఎంటీసీ సక్రిలతో కలిసి సత్కరించారు.

శంకర్‌పల్లి : చిన్న పిల్లలకు తప్పనిసరిగా జేఈ (జపనీస్ ఎన్‌సెఫలైటీస్) వ్యాక్సిన్ వేయించాలని శంకర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ రేవతి తెలిపారు. బుల్కాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు జేఈ వ్యాక్సిన్లు వేశారు.

ఆమనగల్లు : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు తెలిపారు. జీపీ కార్మికులకు నెలల కాలంగా వేతనాలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ కార్మికులు ఆమనగల్లు పట్టణంలో భిక్షాటన నిర్వహించారు. సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

ఆమనగల్లు : విద్య, వైద్యం, ఉపాధి కల్పనే ఐక్యత ఫౌండేషన్ ధ్యేయమని ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని ఏవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెన్నై శంకరన్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాన్ని రాఘవేందర్ రెడ్డి సందర్శించారు. కంటి చూపు మందగించిన వారికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి అద్దాలను ఆయన పంపిణీ చేశారు.

యాచారం : మండలంలోని ప్రతీ పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రాల్లో మెదడువాపు ఇంజెక్షన్లు అందుబాటులో పెట్టామని మండల వైద్యాధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో ఏ ఒక్కరు మెదడు వాపు రోగం బారిన పడలేదని ఆమె చెప్పారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో 686 మంది విద్యార్థులకు మెదడు వాపు ఇంజక్షన్లు వేశామన్నారు.

కందుకూరు : శ్మశాన వాటికలో నీటి వసతి లేదని, అంతా పిచ్చి మొక్కలతో నిండిపోయిందని, ప్రహరీ లేకుండా శ్మశాన వాటిక నిర్మించి ఏం లాభమని కాటికాపరుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బ్యాగరి సత్తయ్య, రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బ్యాగరి కుమార్‌లు ఆందోళన చెందారు. వైకుంఠ ధామాల్లో నీటి వసతి లేదు, విద్యుత్ వసతులు లేకపోవడంతో పాటు ప్రహరీలు కూడా లేకపోవడం ఆందోళనకరమన్నారు. ఒక్క వైకుంఠ ధామానికి రూ.12లక్షలు వెచ్చించినా కనీస వసుతులపై ఎందుకు కల్పించలేకపోయారని ప్రశ్నించారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



శంషాబాద్ రూరల్, జూలై 25: శంషాబాద్ మండల పరిధిలోని ఇంద్రానగర్ దొడ్డి నాలాలో ఓ గుర్తు తెలియని మూగ వ్యక్తి నీటిలో మునిగి చనిపోయినట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. గురువారం మధ్యాహ్న సమయంలో ఇంద్రనగర్ దొడ్డి నాలాలో వ్యక్తి మృతదేహం నీటిపై తేలి ఉండటంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా చనిపోయిన వ్యక్తి వయస్సు 40-45 ఉంటుందని, సమాచారం తెలిసినవారు 9490617213, 8712663308 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పుస్తెలతాడు అపహరణకు దుండగుల యత్నం

● ప్రతిఘటించిన మహిళ.. దౌడు తీసిన దొంగలు
● మహిళను అభినందించిన పోలీసులు

కొత్తూర్, జూలై 25: కిరాణ షాపు నడుపుతున్న ఓ మహిళ దగ్గరకు వచ్చి సిగరెట్లు, బిస్కెట్లు కొంటున్నట్లు నటించి.. మంగళసూత్రాన్ని దొంగిలించేందుకు ప్రయత్నిస్తుండగా మహిళ ప్రతిఘటించడంతో దొంగలు పలాయనం చిత్తగించిన ఘటన కొత్తూర్ పోలీస్‌స్టేషన్‌లోని కొడిచర్లతండా జీపీ ఖాజీగూడతండాలో గురువారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు కథనం ప్రకారం.. ఖాజీగూడ తండాకు చెందిన కొడావత్ మంజుల కిరాణ షాపు నడుపుతోంది. గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు సిగరెట్లు ఉన్నయా? అని అడుగగా.. ఆమె లేవని చెప్పింది. మరి కాసేపటికి తిరిగి వచ్చి ఏ సిగరెట్లు ఉన్నాయని అడుగగా, అమెరికన్ సిగరెట్లు మాత్రమే ఉన్నాయని చెప్పడంతో సిగరెట్లు, అగ్గిపెట్టె తీసుకుని వెళ్లిపోయారు. అయతే, అప్పటికే మహిళ మెడలోని మంగళసూత్రాన్ని గమనించిన దుండగులు కొద్దిసేపటికి తిరిగి దుకాణం వద్దకు వచ్చారు. ఓ వ్యక్తి దుకాణం వద్దకు రాగా, మరో వ్యక్తి దుకాణం ముందు బైక్‌తో ఉన్నాడు. దుకాణం వద్దకు వచ్చిన వ్యక్తి బిస్కెట్ ప్యాకెట్ కొనుగోలు చేసి పేటీఎం ద్వారా డబ్బులు చెల్లించాడు. ఈ క్రమంలో మంజుల మెడలో మంగళసూత్రాన్ని తెంపుకొని పరారయ్యే క్రమంలో మహిళ ప్రతిఘటించి కేకలు వేయడంతో ఇద్దరు దొంగలు బైక్‌పై పరారయ్యారు. ఇన్‌స్పెక్టర్ పరిశీలించి, మహిళ నుంచి వివరాలు సేకరించారు. దొంగలను ప్రతిఘటించిన మహిళను ప్రత్యేకంగా అభినందించారు. మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

తలకొండపల్లి, జూలై 25 : బొలెరో ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటుచేసకుంది. పోలీసుల కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన వడ్డె ఎల్లయ్య చిన్న కుమారుడు వేణు బైక్‌పై ప్రధాన రహదారి నుంచి ఇంటికి వెలుతున్నాడు. వివేకానంద విగ్రహం సమీపంలో ఎదురుగా వస్తున్న బొలెరో బైక్‌ను ఢీకొట్టింది. వేణు (22) తీవ్రంగా గాయపడగా అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. బొలెరోను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

విద్యుదాఘాతంతో ఆవు మృత్యువాత

కడ్తాల్, జూలై 25: విద్యుదాఘాతంతో ఆవు మృతిచెందిన సంఘటన కడ్తాల మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. కడ్తాలకు చెందిన తిరునగరి వేణుగోపాల్ ఆవు వ్యవసాయం పొలం వద్ద గడ్డి మేస్తోంది. ఈ క్రమంలో పక్కనే ఉన్న కోళ్ల పరిశ్రమ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆవు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. దాని విలువ రూ. 80వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని వేణుగోపాల్ కోరారు.

కుక్కల దాడిలో నలుగురికి గాయాలు

కొందుర్గు, జూలై 25: మండల కేంద్రంలో గురువారం ఉదయం కుక్కలు దాడి చేసి కరవడంతో నలుగురికి గాయాలయ్యాయి. మండల కేంద్రంలో తాపీమేస్త్రీగా పనిచేస్తున్న గురురాజు ఉదయం కిరాణం షాపులో సామగ్రి కొనుగోలు చేసేందుకు చౌరస్తాకు వస్తుండగా కుక్కలు గుంపుగా వచ్చి దాడి చేసి కరిచాయి. పక్కనే ఉన్న మిగతా గ్రామస్థులు వాటిని అక్కడి నుంచి తరిమేశారు. అలాగే ఓ వీధి నుంచి వెళ్తుండగా శివలీల అనే మహళను, అనంతరం సువర్ణ అనే మరో మహిళను కరిచాయి. కూలీ పనికి వెళ్తున్న ముత్యాలమ్మను ఓ కుక్క కరిచింది. నలుగురు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స పొందారు. మెరుగైన చికిత్స నిమిత్తం గురురాజు, ముత్యాలమ్మను షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి పంపించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో వ్యక్తిపై కేసు

చేవెళ్ల, జూలై 25 : డ్రంకెన్ డ్రైవ్‌లో భాగంగా ఓ వ్యక్తిపై చేవెళ్ల పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, ట్రాఫిక్ సీఐ ఆ వ్యక్తిని టెస్ట్ చేసేందుకు యత్నించగా సహకరించకపోవడంతో చేయి చేసుకున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. చేవెళ్ల నుంచి శంకర్‌పల్లి వెళ్లే మార్గంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం, సిబ్బందితో కలిసి మూడు రోజుల క్రితం తనిఖీలు నిర్వహించారు. ముడిమ్యాల్‌కు చెందిన ముగ్గురు యువకులు మద్యం తాగి కారులో వచ్చారు. డ్రైవ్ చేస్తున్న మహేశ్‌కు బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయమంటే సహకరించకుండా పోలీసులను బూతులు తిడుతూ పారిపోయేందుకు యత్నించాడు. సీఐ, సిబ్బంది అతడిని పట్టుకుని టెస్ట్ చేయగా.. 90 శాతం పాయింట్లు వచ్చాయి. మరో ఇద్దరు మద్యం తాగిన మైకంలో దురుసుగా ప్రవర్తించడంతో సీఐ వారిని మందలించాడు. వాహనదారులు వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. అయితే, మద్యం తాగిన వారిపై చేయి చేసుకోవడం ఎంతవరకు న్యాయమని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐ వెంకటేశంను వివరణ కోరగా మద్యం తాగి కారు డ్రైవ్ చేస్తూ పట్టుబడిన యువకుడు సరైన సమాధానం చెప్పకుండా ప్రతిఘటించినట్లు చెప్పారు. తమ విధులకు అటంకం కల్గించిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పిరంగి కాలువ గండిని పూడ్చాలి : బక్కని

శంకర్‌పల్లి, జూలై 25 : పిరంగి కాలువ గండికి మరమ్మతులు వెంటనే చేపట్టాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు డిమాండ్ చేశారు. వర్షాలతో శంకర్‌పల్లి మండలంలోని మోకిలలో పిరంగి కాలువకు గండిపడి పంట పొలాలను వరద ముంచెత్తిన నేపథ్యంలో టీడీపీ నాయకులు కాసుల సుభాన్‌గౌడ్, యాదయ్య, జగదీశ్వర్‌రెడ్డి, మాణిక్యం, వెంకటేశ్‌లతో కలిసి బక్కని గురువారం మండల పరిధిలోని బుల్కాపూర్, మోకిల, పిల్లిగుండ్ల, ప్రొద్దటూరు గ్రామాల్లో పర్యటించి పిరంగి కాలువను పరిశీలించారు. మోకిలలో కాలువకు గండిపడి నష్టపోయిన రైతులతో ముచ్చటించి జరిగిన నష్టాన్ని తెలుసుకున్నారు. బక్కని మాట్లాడుతూ గండిపడి నాలుగు రోజులు గడుస్తున్నా అధికారులు మరమ్మతులు చేపట్టక పోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. నీటి పారుదల శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోక పోవడంతోనే కాలువకు గండి పడిందని ఆరోపించారు. రైతులకు భారీ ఎత్తున నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కాలువ పక్కన వెలసిన అక్రమంగా కట్టడాలను కూల్చివేసి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

క్రైస్తవ మైనారిటీల అభివృద్ధికి కృషి

షాద్‌నగర్ రూరల్, జూలై 25: క్రైస్తవ మైనారిటీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర క్రైస్తవ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని చౌలపల్లిలో ఉన్న క్రైస్తవ స్మృతివనంను గురువారం ఆయన పరిశీలించారు. జాన్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి క్రైస్తవులకు అందే అన్ని పథకాలు వర్తింపచేసేందుకు ప్రయత్నిస్తానన్నారు. స్మృతివనాలను అభివృద్ధి సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్‌సింగ్, స్మృతివనం కమిటీ అధ్యక్షుడు రెవరెన్ జోసఫ్ అంజన్న, స్వామిదాస్, డానియెల్, ఫ్రాంక్లిన్ జోసఫ్ తదితరులున్నారు.

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం


లక్ష్మారెడ్డి, మహేశ్, నర్సింహ

ఆమనగల్లు, జూలై 25 : ఆమనగల్లు లయన్స్‌క్లబ్ 39వ అధ్యక్షుడిగా పసుల లక్ష్మారెడ్డి కార్యదర్శిగా దోనాదుల మహేశ్, కోశాధికారిగా గుజ్జరి నర్సింహలు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం ఈనెల 31న ప్రమాణ స్వీకారం చేస్తుందని లయన్స్‌క్లబ్ పీఆర్‌వో ఎంఏ పాష తెలిపారు. వెల్దండ మండలం తోడేటి చెన్నారెడ్డి గార్డెన్‌లో సాయంత్రం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేస్తుందని పేర్కొన్నారు. ఉపాధ్యక్షులుగా గోవర్ధన్‌రెడ్డి, ఎం. రాంరెడ్డి, పి. వెంకట్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఎంగళి బాలకృష్ణ, పీఆర్‌వోగా ఎంఏ పాషా, తదితరులు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు చెప్పారు.